ప్రజాశక్తి
శుక్రవారం 20 అక్టోబర్ 2023
5
విజయనగరం



ముగ్గురు ఆర్‌డిఒలు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం, బొబ్బిలి, చీపరుపల్లి రెవెన్యూ డివిజన్లకు ముగ్గురు కొత్త ఆర్‌డిఒలు రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌డిఒలను బదిలీ చేస్తూ, కొత్తవారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం ఆర్‌డిఒ సూర్యకళను శ్రీకాకుళం బదిలీ చేయగా, ఇక్కడ ఆర్‌డిఒగా దాట్ల కీర్తి నియమితులయ్యారు. ఆమె గతంలో జిల్లాలో డిబిసిడబ్ల్యుఒగా విధులు నిర్వహించారు. బొబ్బిలి ఆర్‌డిఒ శేషశైలజను జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేయగా, ఆమె స్థానంలో ఆదిమూలం సాయిశ్రీ నియమితులయ్యారు. చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం.అప్పారావును జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ బి.శాంతి నియమితులయ్యారు.

విద్యుత్తు సంస్కరణలతో

ఉద్యోగ, ఉపాధికి గండి

- రైతుల రాయితీకి ఎసరు
- ప్రతిఘటనకు ప్రజలంతా ఐక్యం కావాలి
- సదస్సులో సిపిఎం, సిఐటియు నేతల పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విద్యుత్తు సంస్కరణలతో కేవలం వినియోగదారులకే కాకుండా సగటు మనిషికి నష్టం వాటిల్లుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పంపుసెట్లకు వర్తింపజేస్తున్న రాయితీలను కూడా ఎత్తివేసే ప్రమాదం ఉందని అన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ఇప్పటికే విశాఖలోని ఎన్‌టిపిసి తదితర విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ప్రైవేటీపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసిందన్నారు. ఈనేపథ్యంలో ప్రజలంతా సంఘటితమై విద్యుత్ రంగం సంస్కరణలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన 'విద్యుత్ సంస్కరణలు - ప్రజలపై భారాలు' అనే అంశంపై కెఎల్‌పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర సదస్సులో వీరు ప్రసంగించారు.

సదస్సులో తొలుత తులసీదాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, విశాఖ రైల్వే జోన్ సహా రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన అనేక హామీలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. తాజాగా స్టీల్‌ప్లాంట్ సహా పోర్టులు, ఎయిర్‌పోర్టులు ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. ఇది చాలదన్నట్టు ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట అదనంగా భారాలు మోపుతోందన్నారు. సోలార్, పవన్ విద్యుత్‌తో రూ.1కే యూనిట్ విద్యుత్ సరఫరా చేయవచ్చని, భవిష్యత్తులో తమ పార్టీ ఆధ్వర్యాన ఈ విధమైన ప్రయోగం చేసి చూపిస్తామని సవాలు చేశారు. విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల గృహ వినియోగదారులతోపాటు వ్యాపారులు, పరిశ్రమల మనుగడ కష్టతరంగా మారుతోందన్నారు. ఫలితంగా ఉన్న ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కరణల్లో భాగంగా స్మార్ట్‌మీటర్లు, ప్రీపెయిడ్ విధానం అమలు చేస్తే విద్యుత్ రంగంలో ఇప్పటికే పనిచేస్తున్న మీటర్ రీడింగ్ తదితర ఉద్యోగులు తొలగింపునకు గురయ్యే ప్రమాదం ఉంటుందని, కొత్తగా ఆ రంగంలో ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశాలు లేవని అన్నారు. ఇప్పటికే అవలంభించిన విధానం ఉత్పత్తి సంస్థల్లో వల్ల పెట్టుబడిదారుల హవా పెరిగిందని, ఇప్పుడు ట్రాన్స్‌మిషన్, పంపిణీ విభాగాల్లో కూడా అడుగు పెట్టేందుకు ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని వివరించారు. మోసపూరితమైన ఈ విద్యుత్ సంస్కరణలపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన వైఖరి బిజెపికి అనుకూలంగానే ఉందన్నారు. ఇలాంటి మోసకారి విధానాల వల్ల ఇప్పటి వరకు వామపక్ష పార్టీలు, ముఖ్యంగా సిపిఎం మాత్రమే పోరాడాయని, తాజాగా ముందుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలపైనా రాజీలేని పోరాటం చేస్తామని, ఆ తరువాత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కర్నూలు జిల్లా ఆధోని, శ్రీకాకుళం జిల్లా మందస, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి మూడు బస్సు యాత్రలు ఈనెల 30, వచ్చేనెల 2న ప్రారంభమై నవంబర్ 15నాటికి విజయవాడ చేరుతాయని అన్నారు. ఆరోజు జరగబోయే బహిరంగ సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు హాజరు కానున్నారని వివరించారు. ఆ బహిరంగ సభకు జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ భారాల వల్ల జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చాలా వరకు మూతపడ్డాయని, ఫలితంగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయారని అన్నారు. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో పరిశ్రమలకు యూనిట్ రూ.3కు సరఫరా చేస్తున్నారని, మన రాష్ట్రంలో మాత్రం రూ.8.50వసూలు చేస్తున్నారని తెలిపారు. రూ.7,300 కోట్ల అప్పుకు కక్కుర్తిపడ్డ సిఎం జగన్మోహన్‌రెడ్డి మోడీ మోసపూరిత విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణల బిల్లును పార్లమెంట్‌లో పెట్టేందుకు సాహసించని మోడీ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో కూడా నెగ్గే పరిస్థితి లేదన్నారు. అందుకనుగుణంగా పోరాడేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మోడీ చెప్పిందల్లా చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు.

సభాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాతూ విద్యుత్ భారాలు మోపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చంద్రబాబు మాదిరిగా గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందని, అందుకనుగుణంగా ప్రజల్ని చైతన్యపరుస్తామని అన్నారు. విద్యుత్ సంస్కరణలపై సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా రాజీలేని పోరాటం చేసేందుకు సదస్సు ఏకగ్రీవంగా తీర్మాణించింది. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, టివి రమణ, పి.శంకరావు, రెడ్డి శంకర్రావు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన జనం

ఒపిఎస్ అమలుకు

యుటిఎఫ్ నిరవధిక దీక్ష

- ప్రారంభించిన జెఎసి చైర్మన్ మురళి
- ఒపిఎస్ అమలు చేసే వారికే రాజకీయ మనుగడ
- ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు నాయకుల సంఘీభావం



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ మురళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరవధిక నిరాహార చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట గురువారం ప్రారంభమైన ఈ దీక్షలను ఎపిజెఎసి జిల్లా ఛైర్మన్ జె.మురళి దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒపిఎస్ అమలు విషయంలో ఉద్యోగులను మోసం చేసిందన్నారు. 2004లో పెన్షన్ విధానం రద్దు చేసినప్పటి నుండి దేశవ్యాపితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగైదు సంవత్సరాలుగా ఉద్యమం సమరశీలంగా నడుస్తున్నదని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని గత ఎన్నికల సందర్భంగా జగన్మోమహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయకుండా మోసం చేయడం బాధ్యతా రాహిత్యమని అన్నారు. సిపిఎస్ రద్దుకు చేస్తున్న పోరాటం న్యాయమైనదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ఈ ఆందోళనకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలని అన్నారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జె ఎవిఆర్ కె ఈశ్వరరావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఐదేళ్లు అవుతున్నా రద్దు చేయకుండా జిపిఎస్ పేరుతో ఉద్యోగులను నమ్మించి మోసం చేశారన్నారు. జిపిఎస్ మా కొద్దని, ఒపిఎస్ అమలు చేయాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇవ్వకుండానే సిపిఎస్ ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. లక్షల మంది ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నా ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నిరవధిక దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ తిరుపతి నాయుడు, యుటి ఎఫ్ సిపిఎస్ విభాగం జిల్లా కన్వీనర్ పి.రామ్ ప్రసాద్ కూర్చున్నారు. వారికి మద్దతుగా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సత్య శ్రీనివాస్, కె.ప్రసాదరావు, రాజారావు, జి.నిర్మల, త్రినాధరావు, రాధాభవాని, భాస్కరరావు పాల్గొన్నారు.

దీక్షకు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల మద్దతు

నిరవధిక దీక్షకు ఎపిటిఎఫ్ నాయకులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, బిటిఎ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, సిఐ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా నాయకులు వి.లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ,సిఐటియు నాయకులు కె.సురేష్, జగన్మోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, అపార్ట్‌మెంట్ కాలనీ వాసులు అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే సిపిఎస్, జిపి ఎస్ ను రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేసే వరకు జరిగే పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

16,893 మందికి జగనన్న చేదోడు

లబ్ధిదారుల ఖాతాకు రూ.16.89 కోట్లు జమ



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న చేదోడు పథకం కింద కుల వృత్తులు చేసుకునే రజక, నాయీ బ్రాహ్మణులు, టైలరు వృత్తిదారులకు 4వ విడతగా ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి జమ చేసారు. గురువారంకర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే బహిరంగ సభలో బటన్ నొక్కి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నాల్గవ విడత ఆర్థిక సహాయాన్ని జమ చేసారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, బి.సి కార్పొరేషన్ ఇడి పెంటోజీ రావు, బిసి నాయకులు, లబ్ధిదారులు పాల్గొని వీక్షించారు. ఈ పథకం కింద దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జిల్లాలో 16893 మంది లబ్ధిదారులకు రూ.16.89 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాలకు జమ చేసింది. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

టూరిజం కార్మికులను పర్మినెంట్ చేయాలి

విజయనగరం : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో గల ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కార్మికుల సంఘం ప్రతినిధులు గురువారం రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావును కలిసి వినతినిచ్చారు. గతంలో కూడా పలుమార్లు ప్రభుత్వం దృష్టిలో పెట్టినప్పటికీ సమస్య పరిష్కరించలేదని, ఈపరిస్థితుల్లో ఈనెల 22 నుంచి ఏరోజు నుంచైనా సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. తక్షణం డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించేలా కమిషన్ సిఫార్సు చేయాలని కోరారు. 2010లో టూరిజం కార్పొరేషన్ యాజమాన్యం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి కాంట్రాక్ట్ మరియు అవుట్సోర్సింగ్ వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్ ను కలిసిన వారిలో కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి అంజలిరావు, రాష్ట్ర కార్యదర్శి బాబూరావు ఉన్నారు.

ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోను కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్. రమేష్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజల్లోకి పథకాలను తీసుకెళ్లాలి

వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-బొండపల్లి

నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి.. ఆ పార్టీ శ్రేణులను కోరారు. బొండపల్లి మండలం గొట్లాం సత్య ఫంక్షన్ హాల్ ఆవరణలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలోనే అమలయ్యాయని చెప్పారు. రూ.2.35 లక్షల కోట్లను ప్రజా సంక్షేమం పేరిట బడుగు, బలహీన వర్గాల వారికి అందించామని వివరించారు. జగనే ఎందుకు ఈ రాష్ట్రానికి కావాలి? అనే అంశాలను ప్రజలకు వివరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

తప్పు చేశారు.. అందుకే జైల్లో..

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను ఎందుకు ఆలోచన చేయలేదని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప ప్రజా సంక్షేమపై దృష్టి సారించలేదని విమర్శించారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే జైల్లో ఉన్నారని తెలిపారు. కోట్లు ఖర్చు పెట్టి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తప్పు చేయకపోతే నిరూపించుకోవాలని సూచించారు.

సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పి.సురేష్‌బాబు, రఘురాజు, పి.విక్రాంత్, ఎఎంసి చైర్మన్ వి.ముత్యాలునాయుడు, ఎంపిపిలు చల్ల చలంనాయుడు, బెల్లాన జ్ఞాన దీపిక, గేదెల సింహాద్రి అప్పలనాయుడు, పి.హైమావతి, జెడ్‌పిటిసిలు రాపాక సుర్యాప్రకాశరావు, గార తవుడు, వర్రి నర్సింహమూర్తి. రౌతు రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, బూడి వెంకటరావు, కడుబండి రమేష్‌నాయుడు, గొర్లె రవికుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బి.వి.ప్రభూజి, మహంతి రమణ, గొల్లు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

లిఫ్ట్ పద్ధతి సరికాదు

ప్రజాశక్తి-విజయనగరంకోట


ఆర్‌టిసి ఉద్యోగులపై మేనేజెమెంట్ అమలు చేస్తున్న లిఫ్ట్ పద్ధతి సరైనది కాదని ఎన్‌ఎంయు జోనల్ వైస్ ప్రెసిడెంట్ వి. ప్రదీప్ కుమార్ అన్నారు. గురువారం ఆర్‌టిసి డిపో వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జోన్ 1 పరిధిలో ఉన్న జిల్లాలో ఈ పద్ధతిని అమలు చేస్తున్నారని అన్నారు. 2020 సంవత్సరం జనవరి ఒకటో తేదీన ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీకి కొత్త సమస్యలు స్థానిక యాజమాన్యాలతో వచ్చి పడిందన్నారు. కండక్టర్లను, డ్రైవర్లకు వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. డ్రైవర్లను కండక్టర్లుగా, కండక్టర్లను డ్రైవర్లుగా మార్చడం సరైనది కాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, డిపో కార్యదర్శి కెసిహెచ్ మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్ బాబా 127వ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సూఫీ మహా చక్రవర్తి హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 127 వ జయంతి వేడుకలు గురువారం బాబామెట్ట ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకులకు హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా సూఫీ వారసులు, చీమలపాడు దర్గా దర్బార్ షరీఫ్ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మొహియినుద్దిన్ తాజ్ ఖాదరీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా దర్బార్ నుంచి పకీర్ ఖవ్వాలి, మేళ తాళాలు మధ్య ఊరేగింపుగా ఖాదర్ బాబా దర్గా కి వెళ్లి, దర్గాలో బాబాకు సుగంధ తైలాలు సమర్పించి పూలాభిషేకం చేశారు. అనంతరం విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన బాబా వారి భక్తుల కోసం ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎమ్‌డి ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి(ఖలీల్ బాబు) ఆధ్వర్యంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ అన్నదానం నిర్వహించారు.

వైసిపి నాయకులతో కోలగట్ల భేటీ



కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి నివాసంలో వైసిపి నాయకులతో మాట్లాడుతున్న కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని 32వ డివిజన్ కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి నివాసంలో గురువారం ఉదయం వైసిపి నాయకులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి భేటీ అయ్యారు. డివిజన్‌లో పార్టీ బలోపేతం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వార్డులో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో డివిజన్ ఇన్‌ఛార్జి భోగాపురపు రవిచంద్ర, వైసిపి డివిజన్ అధ్యక్షులు ఆర్లె కృష్ణారావు, రెడ్డి నాయకులు గురుమూర్తి, బాల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కోలగట్ల

3వ డివిజన్ పూల్ బాగ్, వాడ వీధి జంక్షన్ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. వాడవీధి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్లెట్లను అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఇళ్లకు ఇంటి పన్ను విధించలేదని స్థానికులు చెప్పడంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కోలగట్ల కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ వజ్రపు సత్య గౌరీ, వైసిపి నాయకులు మెండా రమణ, వజ్రపు శ్రీను, వేమూరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మందుగుండు వ్యాపారులు నిబంధనలు పాటించాల్సిందే

ఎస్‌పి ఎం.దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో మందుగుండు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌పి దీపిక తెలిపారు. వారంతా నిబంధనలు పాటించే విధంగా బైండోవరు చేయాలని, అక్రమ మందుగుండు విక్రయ, తయారీదారులపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని ఎస్‌పి కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు చేయాలని, సాంకేతిక ఆధారాలను, సాక్ష్యాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగు చేపట్టాలని సూచించారు. మోటారు వెహికల్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇ-చలానాలు విధించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైట్ కాలర్ నేరాలైన చీటింగు, నమ్మకద్రోహం కేసుల్లో దర్యాప్తు క్షుణ్ణంగా చేపట్టాలన్నారు. మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పెట్రోలింగు, గస్తీని ముమ్మరం చేయాలని, ఎటిఎం కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో భద్రత విధులను సమర్థవం తంగా నిర్వహించిన 2వ పట్టణ సిఐ ఎన్.హెచ్.విజయ ఆనంద్, ఎస్ఐ షేక్ శంకర్, రాజాం చోరీ కేసును చేధించిన ఎస్ఐ వై.రవికిరణ్, అగ్ని ప్రమాదానికి గురైన ప్రయివేటు బస్సులో ప్రయాణికులను సకాలంలో స్పందించి రక్షించిన ట్రాఫిక్ ఎస్ఐ ఎ.ఎం.రాజు, హెచ్‌జి సిహెచ్.వెంకటరావు, అగ్నివీర్ బందోబస్తు నిర్వహించిన ఆర్‌ఎస్ఐ ఎ.రామకృష్ణతోపాటు సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని ఎస్‌పి దీపిక అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎఎస్పిఇ అస్మా ఫర్హీన్, ఎస్ఐబి ఎఎస్‌పి ఎస్.వెంకటరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, డి.విశ్వనాథ్, న్యాయ సలహాదారు వై.పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జెఎఎస్‌తో ప్రజారోగ్యానికి భరోసా

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస.. అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యానికి భరోసా లభిస్తుందని ఎమెల్మ్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని మంగళపాలెం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రోగులను స్వయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన స్వయంగా రక్తపరీక్షలు చేయించుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం చేసినా సరే ఆరోగ్యం విషయంలోనూ అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, సర్పంచ్ అయితంశెట్టి దుర్గ, ఎంపిటిసి అయితంశెట్టి నాగమణి, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు అయితంశెట్టి అనీల్, నాయకులు అమ్మా శ్రీను, జామి సాల్మన్ రాజు, గణేష్, చింతలపాలెం మాజీ సర్పంచ్ భీష్మ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రజారోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్షని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పి.వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, సర్పంచులు చిట్టిపోలు లక్ష్మి, మంచిన కోటి, ఉల్లి శంకర్, చిట్టిపోలు సాయి, కొట్టం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో వావిలిపాడు సచివాలయం వద్ద సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యాన నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించినది. ఈ శిబిరాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు సందర్శించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిన రామునాయుడు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ నాయుడు, వైసిపి నాయకులు జగన్నాథం, బి.సతీష్, జెసి కన్వీనర్ శ్రీను, ఎంపిడిఒ పట్నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.భాగ్యవతి, పిసిసి కన్నంనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలని ధ్యేయంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లి సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడు ఆరోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష లో వైద్య సేవలు అందించిన వైద్య, సచివాలయ, అంగన్వాడి సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మునాయుడు, కోరాకుల అనిత, తహశీల్దార్ టి.ఆదిలక్ష్మి, సర్పంచ్ చిక్కాల హేమలత, నాయకులు చిక్కాల జనార్దన్ రావు, గోపి తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. మందులు అందజేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

బొబ్బిలి : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకు వైద్య సేవలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జమ్ము పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు సందర్శించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరుదైన రక్త దానం



రక్తదానం చేస్తున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విశాఖకు చెందిన చిన్నతల్లి శాస్త్ర చికిత్స నిమిత్తం విజయనగరం గాయత్రి ఆస్పత్రిలో చేరారు. ఆమెకు ఒ పాజిటివ్ రక్తవర్గంలో అరుదైన బొంబాయ్ బ్లడ్ అవసరమైంది. ఇది అరుదైన రక్తం కావడంతో అందు బాటులో లేదు. దీంతో శస్త్ర చికిత్సను 7 రోజులుగా వాయిదా వేశారు. వెంటనే ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకుకు చెందిన నాగేశ్వరరావు విషయం తెలుసుకుని వాట్సప్ ద్వారా సమాచారాన్ని గ్రూపుల్లో పెట్టారు. స్పందించిన జరజాపుపేట సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గ ప్రసాద్ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఆ సంఘం సభ్యుడు లీల ప్రసాద్‌కు తెలియపరిచాడు. విశాఖపట్నంలోని గాజువాకలో ఉంటున్న లీలాప్రసాద్ ఆ సమయంలో ఆరిలోవలో ఛత్రపతి శివాజి వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేసి విజయనగరం గాయత్రి ఆస్పత్రికి పంపించారు. ఆపదలో ఆదుకున్న లీలాప్రసాద్‌ను రోగి బంధువులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మనోజ్, సాధన సభ్యులు పసుమర్తి వెంకటరమణ, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ నాగేశ్వర్ రావు గురువారం అభినందించారు.

29న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.బలరాంనాయుడు ఒక ప్రకటనలో కోరారు. వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. సిపిఎస్ రద్దు చేయాలని, పిఆర్‌సి అమలు చేయాలని, బదిలీ ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి-శృంగవరపు కోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా చదవడం- మాకిష్టం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జ్ఞాపకశక్తి మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ పాల్గొన్నారు.

22న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 22న నగరంలోని అన్ని స్వచ్ఛంద రక్తదాన సంస్థల నిర్వాహకులతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. ఈ మేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైడితల్లమ్మ పండగను పురస్కరించుకుని చాసో స్మారక భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం వాక్ ఫర్ విజయనగరం పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని కోరారు. ఈ సమావేశంలో నిర్వాహకులు పద్మనాభం, ప్రవీణ్ అంచాలయా, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఎం.సీతారాంపురంలో గురమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోండ్రు

పలు కుటుంబాలకు కోండ్రు పరామర్శ

ప్రజాశక్తి- వంగర

మండలంలోని ఎం సీతారాంపురం, బంగారు వలసలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, టిడిపి రాజాం నియోజకవర్గం ఇంఛార్జి కోండ్రు మురళీమోహన్ ఆయా గ్రామాలలో గురువారం పర్యటించి పరామర్శించారు. ఎం సీతారాంపురంలో కర్రి గురమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారులు కర్రి గురువులు, కర్రి నారాయణరావు, కర్రి అప్పారావులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన సైలాడ అప్పల నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె భర్త సైలాడ రాజారావును పరామర్శించారు. బంగారువలసలో ముంజి అప్పల నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుమారుడు టిడిపి నాయకుడు ముంజు గోవిందరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పిన్నింటి మోహనరావు, లచ్చు బుక్త కృష్ణమూర్తి, బెజ్జపురం రవి, మజ్జి గణపతి, అల్లిన రామారావు, బలగ సాయి, రాజాం, రేగిడి, సంతకవిటి టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఇఒపిఆర్‌డిని సత్కరిస్తున్న ఎంపిడిఒ రామారావు, అధికారులు

ఇఒపిఆర్‌డికి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్లలో పనిచేసి బదిలీ అయిన ఇఒపిఆర్‌డి హెచ్ భానోజీరావును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రామారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లాకు బదిలీ పై వెళ్లిన భానోజీ రావుని పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రామారావు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ తప్పని సరిగా ఉంటుందని నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ పుష్ప, కార్యదర్శులు వై. రమణ, కె. రాంజీ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పశువులకు అందుబాటులో మందులు

ప్రజాశక్తి - వంగర

పాడి పశువులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధక శాఖ జెడి ఎ. విశ్వేశ్వర రావు అన్నారు. మండల కేంద్రంలో ఉన్న పశువైద్య కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది అంతా గ్రామాల్లో పాడి రైతులతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ సిబ్బందితో సమన్వయంగా పని చేయాలని సూచించారు. మండలంలో మద్దివలసలో గల పదిమంది గొర్రెల యజమానులకు గొర్రెలను రక్షించుకునేందుకు సబ్సిడీతో కూడిన వలలు, రైన్ కోట్లు, టార్చ్‌లైట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. పాడి రైతులకు అవసరమైన గడ్డి విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు కృత్రిమ గర్భోత్పత్తి మందులు సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు. పశు నష్టపరిహారానికి సంబంధించి మండలంలో ఉన్న రైతులకు నష్ట పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని విలేకర్లు ప్రశ్నించగా ఇప్పటికే అర్హులందరికీ బిల్లులు పెట్టామని తెలిపారు. ఏ గ్రామంలోనైనా పాడి పశువులు అనారోగ్యానికి గురైతే పాడి రైతులు 1962కి కాల్ చేసి అవసరమైన సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ ఆర్ నీలయ్య, సంతకవిటి, రాజాం అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్, తిరుపతిరావు, జయప్రకాష్, వంగర పశు వైద్య ఇంఛార్జి వైద్యాధికారి అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.



పశువైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడి విశ్వేశ్వరరావు

బిటి రోడ్డు ప్రారంభం



రిబ్బన్ కత్తిరించి బిటి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని దాసన్నపేట రైతు బజార్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బిటి రహదారిని గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. 40 లక్షల రూపాయలతో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, నాయన పద్మ, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, వైసిపి నాయకులు నాయన మహేష్, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపాల సందర్శన

నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి నవరాత్రి మండపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కామాక్షమ్మ ఆలయ చైర్మన్ ఎ.బి.సోమరాజు, వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్‌టిసి పట్ల సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్‌టిసి డిపోలో ఆయన తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా అన్ని సెక్షన్లు తనిఖీ చేసి, డిపో అభివృద్ధికి తగు సూచనలిచ్చారు. అనంతరం డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన అభినందన సభలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్.కృష్ణారావు, సూపరింటెండెంట్ వెంకటరావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందిస్తున్న డిపిటిఒ అప్పలనారాయణ

విద్యుత్తు ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సాయికృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు ఉద్యోగుల సంఘం బొబ్బిలి డివిజన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ఎన్‌జిఒ హోంలో గురువారం నూతన కమిటీ ఎన్నిక రాష్ట్ర కార్యదర్శి బలగ సాయికృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.రామునాయుడు, అల్లు శంకరరావును ఎన్నుకున్నారు. విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది.

ఇసుక అక్రమ తరలింపు

అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని పెంట గ్రామంలో వేగావతి నది నుంచి అక్రమంగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం ట్రాక్టర్లను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి సంఘటనా స్థలానికి చేరుకుని, ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నారు. అనుమతులు లేకుండా నది నుంచి ఇసుకను తరలించడం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, దానివల్ల తమ గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు తెలిపారు. తహశీల్దార్ డి.రాజేశ్వరరావును వివరణ కోరగా ట్రాక్టర్లు సీజ్ చేశామని, జరిమానా వేస్తామని తెలిపారు.



సీజ్ చేసిన ట్రాక్టర్లు

జగన్‌ది అరాచక పాలన

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ విమర్శించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలోని మామిడిపల్లి గ్రామంలో బాబుతో నేను అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అరెస్టు అక్రమమని, ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అరాచక పాలన పోవాలి, చంద్రన్న పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని కృష్ణ తెలిపారు. సంకెళ్లు వేసుకోవాల్సిన వారు రాష్ట్రాన్ని పాలిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం 2024లో మనందరం యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఇప్పాక త్రివేణి, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరరావు, లగుడు ఎర్రినాయుడు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాసరావు, మండా త్రినాథ్, సిమ్మా అప్పారావు, దండుపాటి ఎర్రినాయుడు, బాదిరెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ



ఆధార్ సేవలను వినియోగించుకుంటున్న విద్యార్థులు

'లెండి'లో ఆధార్ సేవలపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టల్ శాఖ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఆధార్ అప్డేట్ సేవల ప్రత్యేక డ్రైవ్ గురువారం నిర్వహించారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎన్‌వి సత్యనారాయణ రాజు పాల్గొని డ్రైవ్‌ను ప్రారంభించారు. ఇందులో 349 మంది చిరునామా, ఫోటో, పేరు, పుట్టిన తేదీ మొదలగు వివరాలను సరిచేసుకోగా 217 మంది తమ మొబైల్ నెంబర్‌లను మార్చుకున్నారని సంస్థ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి మాట్లాడుతూ ఈ రెండు రోజుల కార్యక్రమంలో విద్యార్థులు ఫీజు రీయంబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లు అకాడమిక్ బ్యాంకు అఫ్ క్రెడిట్ ఐడిలలో ఆధార్ డేటా లోపాలను సవరించుకోవాలన్నారు. ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగే సమయం లేక, అవగాహన లేక పడుతున్న ఇబ్బందులు గమనించి, కళాశాల యాజమాన్యం పిలుపుతో సంస్థ ఎన్ఎస్ఎస్ యూనిట్ చొరవ తీసుకుని పోస్టల్ శాఖ సహకారంతో నిర్వింహించిందన్నారు. ఈ కార్యక్రంలో పోస్టల్ సిబ్బంది కిషోర్ పట్నాయక్, సురేష్, సత్య ప్రసాద్ పాల్గొని సేవలందించారు. అకడమిక్స్ డాక్టర్ కె.వి నరసింహం, విభాగాధిపతులు, విదార్థులు పాల్గొన్నారు.

నేడు వేపాడ మండల సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తీసుకున్న చర్యలతోపాటు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని అధికారులకు సూచించారు.

నేరాలు ఘోరాలు



ఘటనా స్థలంలో సరస్వతి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భార్య మృతి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గొట్లాం నుంచి చెల్లూరు వెళ్లే బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దత్తిరాజేరు మండలం కన్నాం సర్పంచ్ చుక్క సన్యాసిరావు భార్య చుక్క సరస్వతి (55) మృతి చెందారు. భార్యాభర్తలిద్దరూ రయింద్రం గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో పాల్గొని విశాఖపట్నం కారులో వెళ్తున్నారు. కోరాడపేట బ్రిడ్జి వద్ద గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో సరస్వతి సంఘటన స్థలంలోని మృతి చెందారు. సర్పంచ్ సన్యాసిరావుకు స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.